
ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 10 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.139	202	229
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.130	190	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 21.2

ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్‌పై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో, కేంద్ర ప్రభుత్వం సైతం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. దానికనుగుణంగా రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పటికీ జిల్లాలో దశాబ్దాలుగా నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి, చిరకాల కోరికలుగా ఉన్న ప్రాజెక్టుల పూర్తికి నిధులు, రోడ్లు, ఆస్పత్రుల ఆధునికీకరణ, సాగునీటి పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో స్థానం దక్కుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

- ఎన్నికల హామీలకు బడ్జెట్లో నిధులిస్తారని ఆశాభావం
- విద్యాసంస్థల ఏర్పాటు, వైద్య సదుపాయాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుందనే చర్చ
- సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు నిధులిచ్చేనా?



'భట్టి' బడ్జెట్‌పై బోలెడు ఆశలు

విద్యా సంస్థల ఏర్పాటుపై ఆశలు

జిల్లాలో ఉన్నత విద్యావకాశాలను పెంచేలా, పేద, మధ్యతరగతివర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తెచ్చేలా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అంతా భావిస్తున్నారు. ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీంతో జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఉపాధి కల్పించే కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీ సైతం ఉమ్మడిజిల్లాకు దక్కనుంది. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ పీజీ కళాశాల, నార్కట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడలో మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలు, చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు, కోదాడలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం లభిస్తుందని ఆయా ప్రాంత వాసులు ఆశిస్తున్నారు. హాలియాలో ఇప్పటికే ఉన్న డిగ్రీకళాశాల నూతన భవన నిర్మాణానికి నిధులిస్తారని భావిస్తున్నారు.



మెరుగైన వైద్యసేవలకు కేటాయింపులు ఉండేనా?



ఉమ్మడి జిల్లాలో వైద్యసేవలను క్రమబద్ధీకరించడంతో పాటు, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన కార్యాచరణను ఈ బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంతా ఆశిస్తున్నారు. ప్రధానంగా ప్రతీ మండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఏరియా ఆస్పత్రిని ఏర్పాటుచేయాలనే డిమాండ్లకు ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం లభిస్తాయని భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడేషన్‌కు అనుమతి ఇస్తారని, మోత్కూరులో పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడేషన్, మునుగోడు పీహెచ్‌సీని 30పడకల ఆస్పత్రిగా మార్చాలనే డిమాండ్లు నెరవేర్చాల్సి ఉంది. ఆలేరులో 30పడకల ఆసుపత్రిని 100 పడకలకు మార్చాలని, హాలియాలో 30పడకల ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకాలతో పాటు, మందులు, ఇతర మౌలికవసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరుతా..



దేవరకొండ నియోజకవర్గంలోని డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఇప్పటికే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు. ప్రాజెక్టులతోపాటు తాగునీటి అవసరాలకు, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తా.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

నిధులు కేటాయిస్తేనే పర్యాటక ప్రాంతాల అభివృద్ధి



ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వాడపల్లి శ్రీలక్ష్మీనరసింహ, మీనాక్షి అగస్తేశ్వర ఆలయాలతో పాటు, దేవరకొండ, దేవరచర్ల, పిల్లలమర్రి, మేళ్లచెర్వు స్వయంభు శంభులింగేశ్వర ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దేవరకొండ ఖిల్లాకు పూర్వవైభవం తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. చౌటుప్పల్ మండలంలోని రాచకొండను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటుచేయాలనే డిమాండ్లు ఉన్నాయి. భువనగిరి ఖిల్లా అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం నిధులు కేటాయించగా, పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే దీనికి తోడ్పాటుగా రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

కొత్త మండలాల్లో సౌకర్యాల కోసం ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటైన కొత్త మండలాల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రధానంగా మండల కార్యాలయాలకు నూతన భవనాలు, ఇతర వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తారని ఆయా మండల వాసులు భావిస్తున్నారు. మిర్యాలగూడ మునిసిపాలిటీలో దశాబ్దకాలంగా అసంపూర్తిగా నిలిచిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పూర్తికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, హాలియా మునిసిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. వీటితోపాటు పలు మౌలిక వసతుల కల్పనపై బడ్జెట్‌లో నిధులు ఉంటాయని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలుగా ఊరిస్తున్న పలు సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు ఈ బడ్జెట్‌లో గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కృష్ణానది నికర జలాల కేటాయింపులున్న ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తికి భారీగా నిధులు ఉంటాయని అనుకుంటున్నారు. సొరంగమార్గం పూర్తయితే ఉమ్మడి జిల్లాలో 3.50లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు తప్పుతాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకం పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. పెండ్లిపాకల ప్రాజెక్టు, మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికి పూర్తిస్థాయిలో నిధులు అవసరం. నకిరేకల్ నియోజకవర్గంలో బి.వెల్లంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకానికి రూ.400కోట్లు, కట్టంగూరు మండలంలో అయిటిపాముల రిజర్వాయర్ పూర్తికి రూ.100కోట్లు మంజూరు కావాల్సి ఉంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కేశవాపురం, వాడపల్లి-బొత్తలపాలెం, దున్నపోతులగండి, వీర్లపాలెం తోపుచర్ల ఎత్తిపోతల పథకాల పూర్తికి నిధులు కేటాయించాల్సి ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలో బునాదిగానికాల్వ పూర్తిచేసి మోత్కూరు, అడ్డగూడూరుకు సాగునీటి వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే సామేల్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. చౌటుప్పల్ మండలంలో పిల్లాయిపల్లి కాల్వ పూర్తికి, చండూరు మండలం బెండలమ్మచెరువు నిర్మాణానికి, శేషులేటివాగు ఫీడర్ ఛానల్, కొండాపురం ఫీడర్ ఛానల్ నిర్మాణాలకు నిధులివ్వాలని కోరుతున్నారు. కనగల్ మండలంలో ఏఎమ్మార్పీ కాల్వ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేయాలనే ప్రధాన డిమాండ్ ఉంది. పొనుగోడు చెరువుకు నీటి సరఫరా చేసేందుకు కాల్వ నిర్మించాల్సి ఉంది. పిల్లాయిపల్లి కాల్వ నిర్మించి రేగట్టెకు నీటి తరలింపు, పగిడిమర్రి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులిస్తారని ఆశిస్తున్నారు. హాలియా మండలంలో పేరూరు మేజర్ ఆధునికీకరణ పనులు, తిరుమలగిరి (సాగర్) మండలంలోని నెల్లికల్లు లిఫ్టు పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై ఈ బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలకు, నిర్వాసితులకు అవసరమైన పరిహారాన్ని ఈ బడ్జెట్‌లో కేటాయించాలనే డిమాండ్ ప్రధానంగా ఉంది. సూర్యాపేట నియోజకవర్గంలో కీలకమైన శ్రీరాంసాగర్ రెండోదశ చివరి భూములకు నీరందించేందుకు కాల్వల ఆధునికీకరణ, పనుల పూర్తికి నిధులివ్వాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

● అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం

ఆటో కార్మికుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట రూరల్: ఆటో కార్మికుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, యాదగిరిగుట్టలో ఆటో కార్మికులను ఆదుకోవాలని ప్రస్తావించగా, ఆయన మాటలకు అడ్డుతగులుతూ ప్రభుత్వ విప్ అయిలయ్య స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి ఆలయాన్ని రూ.1200 కోట్లతో పునర్నిర్మాణం చేశారని, అయినా స్వామి వారిని దర్శించుకొనే భక్తులు, ఆటో కార్మికులు, భూములు కోల్పోయిన వారి బాధలు చూస్తే ప్రతీ ఒక్కరికి అర్థమవుతుందన్నారు. అభివృద్ధి పేరుతో 500 కుటుంబాలను ఇబ్బందులకు గురిచేశారని, 300మంది కార్మికుల ఆటోలను కొండపైకి వెళ్లకుండా రద్దుచేసి వారి పొట్టలు కొట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు చొరవతో ఆటోలను తిరిగి కొండపైకి అనుమతించారని, ఈ నెలలో దీన్ని ప్రారంభిస్తామన్నారు. భక్తులకు వసతి కల్పించేందుకు డార్మెటరీ హాల్ నిర్మాణం అవుతోందని ఆయన వివరించారు. వైటీడీఏ పేరుతో కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి 50శాతం నిధులు దోచుకున్నారని ఆరోపించారు. యాదాద్రి ఆలయంలో అర్చకులకు కనీస సౌకర్యాలు లేవని, ఇలాంటి పనులు చేసిన గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మొసలికన్నీరు కార్చడం హాస్యాస్పదమన్నారు.

పదేళ్ల పాలనలో మూసీ మురికి నీరే గతి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లి: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నకిరేకల్ నియోజకవర్గంలో కనీసం ఒక్క ఎకరాకు అదనంగా నీరివ్వలేదని, సాగు నీటి ప్రాజెక్టులకు నోచుకోని నియోజకవర్గంలో మూసీ మురికి నీరే తప్ప కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటి చుక్క ఇవ్వలేకపోయారని ఎమ్మెల్యే వేముల వీరేశం అసెంబ్లీలో ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ప్రారంభోపన్యాసం చేసిన ఆయన ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇదివరకు బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, అక్కడ అవమానించినందునే తనను ఆదరించిన కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన తప్పులు తనకు తెలుసని, తనను అనవసరంగా కెలకవద్దని, తనతో కెలికించుకోవద్దని హెచ్చరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఏ ప్రాజెక్టును బీఆర్ఎస్ పూర్తి చేయలేదన్నారు.

మిషన్ భగీరథ ద్వారా తన నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా కాకపోగా, ప్రత్యామ్నాయ నీటి పథకాలకు నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో వార్డుల్లో ఉన్న కుళాయిల ద్వారానే సరిపడా నీళ్లందాయన్నారు. ఒక్క గురుకుల పాఠశాలకు కూడా సొంత భవనం నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ విజయంతో నియంత పాలనకు తెరపడి, స్వచ్ఛ తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి ఓపికతో ఉండాలన్నారు. ఇదిలా ఉండగా, బడ్జెట్ సమావేశా సందర్భంగా గవర్నర్ తీర్మానానికి ధన్యవాదాలు తెలుపుతూ అధికార పక్షం నుంచి ప్రసంగించే అవకాశం వీరేశానికి దక్కింది. తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అట్టహాసంగా ఖోఖో పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి 56వ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు యాదాద్రి జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను డీఈవో నారాయణరెడ్డి ప్రారంభించగా, తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. తొలిరోజు 14 మ్యాచ్‌లు జరిగాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో హోరాహోరీగా సాగుతున్న పోటీలను తిలకించేందుకు స్థానికులు, క్రీడాభిమానులు ఆసక్తి చూపించారు.

●7లో..

పోలీస్‌శాఖలో కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

ముగ్గురు సీఐలు, 23మంది ఎస్ఐల బదిలీ

నల్లగొడ టౌన్, ఫిబ్రవరి 9: జిల్లాలో పోలీస్‌శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఎస్ఐలు, సీఐలకు ఒక్కొక్కరిగా స్థానచలనం కల్పిస్తున్నారు. ఇటీవలే పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేయగా, తాజాగా ముగ్గురు సీఐలు, 23మంది ఎస్ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.


బదిలీ అయిన ఎస్ఐలు, సీఐల వివరాలు ఇలా..

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.రాంమూర్తి	నల్లగొండ ట్రాఫిక్	కొండమల్లేపల్లి
పి.వీరబాబు	కొండమల్లేపల్లి	పెద్దవూర
బి.రాజు	నేరడుగొమ్ము	డిండి
డి.సైదులు	డిండి	దేవరకొండ ఎస్ఐ-2
కె.సతీష్	దేవరకొండ ఎస్ఐ-1	నేరేడుగొమ్ము
వి.శేఖర్	మహిళా పీఎస్ ఎస్ఐ-1	మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐ-2
ఎన్.సందీప్‌రెడ్డి	సీసీఎస్ నల్లగొండ	నల్లగొండ వన్‌టౌన్ ఎస్ఐ-2
బి.శ్రీకాంత్‌గౌడ్	వీఆర్ నల్లగొండ	నార్కట్‌పల్లి ఎస్ఐ-2
డి.నర్సింహులు	వీఆర్ నల్లగొండ	గుడిపల్లి
యు.సతీష్	శాలిగౌరారం	నకిరేకల్
ఎం.శోభన్‌బాబు	హాలియా ఎస్ఐ-1	దేవరకొండ ఎస్ఐ-1
డి.సతీష్‌రెడ్డి	వీఆర్ నల్లగొండ	హాలియా ఎస్ఐ-1
ఎన్.ధర్మా	వీఆర్ నల్లగొండ	హాలియా ఎస్ఐ-2
కె.గోపికృష్ణ	దేవరకొండ	మహిళా పీఎస్ ఎస్ఐ-1
ఎన్.శ్రీను	సీసీఎస్ నల్లగొండ	కట్టంగూర్
కె.కృష్ణమూర్తి	వీఆర్ నల్లగొండ	నల్లగొండ ట్రాఫిక్
వి.నారాయణరెడ్డి	సీసీఎస్ నల్లగొండ	తిరుమల సాగర్
వి.సురేష్	తిరుమలగిరి సాగర్	నల్లగొండ టూటౌన్ ఎస్ఐ-2
వి.మహేశ్వర్	వీఆర్ నల్లగొండ	డీఎస్‌బీ నల్లగొండ
ఎ.రంజిత్	గుడిపల్లి	సీసీఎస్ నల్లగొండ
ఎ.రమేష్‌నాయక్	పెద్దవూర	నల్లగొండ ట్రాఫిక్
ఈ.రవి	వీఆర్ నల్లగొండ	కనగల్
ఎం.అయిలయ్య	డీసీఆర్‌బీ సూర్యాపేట	శాలిగౌరారం
సీఐ పేరు	**ప్రస్తుత స్థానం**	**బదిలీ స్థానం**
వీఎన్‌డీ.ప్రసాద్	వెయిటింగ్	మిర్యాలగూడ వన్‌టౌన్
ఆర్.గోపి	వీఆర్ నల్లగొండ	డీటీసీ నల్లగొండ
ఎస్.రాఘవరావు	శాలిగౌరారం	హాలియా సర్కిల్

డబుల్ రైల్వేలైన్‌తో మహర్దశ

మోటమర్రి-విష్ణుపురం డబ్లింగ్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

దామరచర్ల, ఫిబ్రవరి 9: పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న దామరచర్ల మండలానికి డబుల్ రైల్వేలైన్ నిర్మాణంతో మహర్దశ కలగనుంది. ఈనెల 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భేటీ అయిన ఆర్థికవ్యవహారాల కమిటీ మోటమర్రి-విష్ణుపురం డబ్లింగ్‌కు కీలక నిర్ణయం తీసుకుంది.దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ప్రధానంగా ఖమ్మం జిల్లా మోటమర్రి రైల్వేజంక్షన్ నుంచి మండలంలోని విష్ణుపురం రైల్వేస్టేషన్ వరకు 88.81కి.మీమేర డబుల్ రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది.



విష్ణుపురం వద్ద ప్రస్తుతం ఉన్న సింగిల్‌లైన్ ట్రాక్

రైల్వే లైన్ పూర్తయితే పెరగనున్న రద్దీ

డబుల్ రైల్వే లైన్ నిర్మాణంతో స్థానిక రైల్వే స్టేషన్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ఖాజీపేట-విజయవాడ, సికింద్రాబాద్-గుంటూరు రైలు మార్గాలను మోటమర్రి-విష్ణుపురం మార్గాలు అనుసంధానంగా ఉంటాయి. ఈ డబుల్ లైన్ నిర్మాణంతో రెండు రాష్ట్రాల్లోని 90మండలాలకు చెందిన ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందని రైల్వే అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే స్థానిక రైల్వే స్టేషన్ మీదుగా స్థానిక పరిశ్రమల నుంచి భారీ స్థాయిలో సరుకు రవాణా జరుగుతోంది. ప్రధానంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ నిర్మాణం పూర్తయితే 12.29మిలియన్ టన్నుల బొగ్గును వినియోగించనున్నారు. ఎక్కువ భాగం బొగ్గును సింగరేణి నుంచి దిగుమతి చేసుకునేందుకు ప్రతీరోజు 14గూడ్స్ రైళ్లను వినియోగించనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వేలైన్ డబ్లింగ్‌తో ప్రయోజనం కలగనుంది.

రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలి

మండల కేంద్రంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి పక్కనే ఉన్న దామరచర్ల రైల్వేస్టేషన్‌ను 1988లో ప్రారంభించగా, ప్రయాణికులు లేరనే కారణంతో 1994లో దీన్ని రైల్వేశాఖ మూసివేసింది. దీంతో మండల కేంద్రం నుంచి సుమారు 2కి.మీ దూరంలోని విష్ణుపురం రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు వెళ్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరిస్తే యాదాద్రి థర్మల్ పరిశ్రమతోపాటు స్థానికంగా వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు రాకపోకలు కొనసాగించేందుకు వీలుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

- 148, 149 సర్వేనెంబర్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఫ్లెక్సీల ఏర్పాటు

నల్లగొండ, ఫిబ్రవరి 9: జీవో నెంబర్ 59ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ స్థలాలను కొందరు జర్నలిస్టులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోగా, వాటిని అధికారులు రద్దుచేశారు. జిల్లా కేంద్ర సమీపం పానగల్‌లోని వేద పాఠశాలకు చేరువలో ఉన్న 148,149 సర్వే నెంబర్లలోని ఎస్ఎల్‌బీసీ ప్రభుత్వ క్వార్టర్స్‌ను గత ఏడాది జూన్ మాసంలో కొంతమంది జర్నలిస్టులతో పాటు ఓ స్థిరాస్తి వ్యాపారి 59 జీవోను అడ్డుగా పెట్టుకొని అక్రమంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం బయటికి రావడంతో ఇది వివాదాస్పదమైంది. దీనిపై జర్నలిస్టులు సంఘాలకు అతీతంగా ఏకమై హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈ ప్లాట్లఅక్రమ రిజిస్ట్రేషన్‌పై జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అప్పటి కలెక్టర్ కర్ణన్‌తో పాటు ప్రస్తుత కలెక్టర్ హరిచందనకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ సైతం నిర్వహించారు. 148, 149 సర్వేనెంబర్లతో పాటు గొల్లగూడలోని డబుల్‌బెడ్‌రూంల సమీపంలోని 370, 371 సర్వే నెంబర్‌లోని ప్లాట్లను సైతం వీరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బయటపడగా,దీనిపైనా ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. ఇప్పటికే విచారణ ముగియగా, గత నెల మూడో వారంలో ఆ భూముల రిజిస్ట్రేషన్‌ను కలెక్టర్ రద్దు చేస్తూ సీసీఎల్ఏకు నివేదించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ప్రభుత్వ భూములను కాపాడేందుకు నీటిపారుదలశాఖ అధికారులు రంగంలోకి దిగారు. సదరు భూమి నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖకు చెందినదని, ఈ భూమిని ఆక్రమిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



అధికారులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 9: సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. సైబర్ నేరగాళ్లు పంపే లింకులను, మెసేజ్‌లను క్లిక్‌చేసి మోసపోవద్దని సూచించారు. ఎస్పీ చందాన దీప్తి ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై శుక్రవారం పట్టణంలోని ఎంవీఆర్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీని ఉపయోగించుకొని సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం వంటి వాటి ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు పంపే ఫ్రెండ్ రిక్వెస్ట్, లింకులు, మేసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైతే హెల్ప్‌లైన్ నెంబర్ 1930 గానీ, 155260 గానీ 8712665575, 8712665625 నంబర్లలోగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఆటోడ్రైవర్లతో ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్, జిల్లా కోర్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మీనారాయణ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ డానియల్, టూటౌన్ సీఐ కొండల్‌రెడ్డి, ఏఎస్ఐ ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

కరుణించు.. నారసింహా!



వైకుంఠ గాలిగోపురం వరకు నిర్మించిన వెహికల్ అండర్ పాస్ బ్రిడ్జి

యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం స్థానిక వ్యాపారుల జీవితాలను చిన్నాభిన్నం చేసింది.. దశాబ్దాలుగా కొండమీద, కొండకింద వ్యాపారు లు నిర్వహిస్తున్న వారు ఆలయ విస్తరణలో సర్వం కోల్పోయారు. స్థానిక వైకుంఠద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు నిర్మించిన అండర్‌పాస్ రహదారి అక్కడి వ్యాపారులను కోలుకోలేకుండా చేసింది. భక్తులు వచ్చే మార్గం లేకుండాపోవడం, బస్‌టెర్మినల్ నుంచి నేరుగా బస్సుల రాకపోకలు కొనసాగుతుండటంతో వ్యాపారాలు మందగించాయి. దీనికి తోడు గండిచెరువు పనుల్లో మందగమనం, మొదటిఘాట్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్, పారిశుధ్యం లోపం భక్తులను, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో కరుణించు నారసింహా అంటూ వ్యాపారులు, భక్తులు వేడుకుంటున్నారు.

●7లో..

పీవీ ఆలోచనల ప్రతిరూపం సర్వేల్ గురుకులం

- దేశంలోనే మొట్టమొదటి గురుకులం
- 1971లో సీఎం హోదాలో ప్రారంభించిన పీవీ
- పీవీ.నర్సింహారావుకు భారతరత్నను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

●7లో..

స్వాతంత్ర్య సమరయోధుడు చినవెంకటరెడ్డి మృతి

- 102ఏళ్ల పరిపూర్ణ జీవనం

నమ్మించి..మేనబావతో విషం కలిపించి హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

డిండి, ఫిబ్రవరి 9 : పథకం ప్రకారం మేనబావతో కల్లులో విషం కలిపించి ఓ వ్యక్తిని హత్య చేసిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ సీఐ సురేష్, ఎస్ఐ సైదులుతో కలిసి దేవరకొండలో కేసు వివరాలు వెల్లడించారు. వీరబోయినపల్లి గ్రామానికి చెందిన నంది సహదేవుడు, అతడి చిన్నాన్న నంది ఈశ్వరయ్యకు మధ్య కొన్నేళ్లుగా భూవివాదం నడుస్తోంది. ఏవిధంగానైనా నంది సహదేవుడిని అంతమొందించాలని భావిస్తున్న ఈశ్వరయ్య నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం వెలమలపల్లి గ్రామానికి చెందిన సహదేవుడి మేన బావ జంగయ్యను సంప్రదించాడు. నాటుసారాలో విషం కలిపి సహదేవుడిని చంపేందుకు పథకం రూపొందించారు. ఈ నెల 5న నాటుసారాలో విషం కలిపి సహదేవుడి వ్యవసాయ పొలంలో సమాధుల వద్ద ఉంచి తీసుకొమ్మని సహదేవుడికి ఫోన్ చేశాడు. సహదేవుడు, అతడి కుమారుడు రాము అదే రోజు సాయంత్రం నాటుసారా తెచ్చుకొని తాగారు. కొద్దిసేపటికే సహదేవుడికి వాంతులు, విరోచనాలు కావడంతో అతడిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సహదేవుడి కుమారుడు రాము హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు విచారణ జరిపి నాటుసారాలో విషం కలిపిన నంది ఈశ్వరయ్య, జంగయ్యలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో ఉద్యోగి ఆత్మహత్య

మునగాల, ఫిబ్రవరి 9: అప్పుల బాధతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా మునగాల ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ముస్కుల వీరశేఖర్(40) నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. అయితే చిట్‌ఫండ్‌లో పెట్టుబడి పెట్టి అప్పులఊబిలో కూరుకుపోయాడు. అప్పులు తీరే మార్గం లేక మనస్థాపం చెంది మూడు రోజుల కిందట క్రిమిసంహారక తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరుణించు నారసింహా!

యాదగిరి క్షేత్రంలో పునర్నిర్మాణ పనులతో వ్యాపారు లు వీధినపడ్డారు. యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠద్వా రం వరకు నిర్మించిన వెహికల్ అండర్ పాస్‌తో వ్యాపారాలు ఏ మాత్రం సాగక తమ బతుకులు ఆగమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి.. మమ్ము రక్షింపరావేమి అంటూ వేడుకుంటున్నారు. ఇక గిరిప్రదక్షిణ రహదారి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది, గండిచెరువు అభివృద్ధి పనులు కొనసాగుతాయా అన్న అనుమానాలు స్థానికులు లేవనెత్తుతున్నారు. మొదటి ఘాట్‌రోడ్ ఉండగా మరో ఫ్లైఓవర్ నిర్మాణం అవసరమా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా పుణ్యక్షేత్రంలో పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉండటం, గుట్టలుగా పేరుకుపోయిన దుర్గంధం వెదజల్లుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● యాదగిరిగుట్ట

యాదగిరీశా శరణు 6



మొదటి ఘాట్‌రోడ్డుకు అనుసంధానంగా నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్

ఆలయ విస్తరణలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారిని విస్తరించాలని వైటీడీఏ నిర్ణయించింది. ఈ క్రమంలో కొండకింద వైకుంఠ గాలిగోపురం నుంచి సన్నిధి హోటల్ వరకు విస్తరణకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేసి ముసాయిదా ప్రణాళికలను రూపొందించారు. సుమారు రూ.13 కోట్లతో విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠ గాలిగోపురం వరకు రహదారిపై వెహికల్ అండర్ పాస్‌ను నిర్మించారు. సుమారు 300 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మించిన అండర్ పాస్ స్థానికుల పాలిటశాపంగా మారింది.

అంతకుముందు

ఆలయ పునర్నిర్మాణానికి ముందు కొండపైన స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు కొండకింద తులసికాటేజ్, స్వామివారి గోశాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుటుంబసభ్యులతో బస చేసేవారు. ఈ క్రమంలో కొండకింద ప్రధాన రహదానికి ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాలకు వెళ్లి పసుపు, కుంకుమ, స్వామివారి ఫొటోలు, మిఠాయిలు, తమ పిల్లలకు కావాల్సిన ఆటబొమ్మలు తదితరాలను కొనుగోలు చేసేవారు. దీంతో కొండపైనే కాకుండా కొండకింద పట్టణ ప్రధాన వీధులు సైతం కోలాహలంగా కనిపించేవి. వైకుంఠ గాలిగోపురం నుంచి కొండపైకి వెళ్లే మెట్లదారిలో స్థానికులు ఏర్పాటుచేసుకున్న దుకాణాల్లో నడకదారి భక్తులు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేవారు. అదేవిధంగా రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాల్లోనే పట్టణ ప్రజలు సైతం సరుకులు కొనుగోలు చేసేవారు. ఇలా స్థానిక వ్యాపారుల వ్యాపారం సజావుగా సాగేది.

అండర్‌పాస్‌తో వ్యాపారుల బతుకులు ఆగం

అండర్‌పాస్ నిర్మాణంతో ఒక్కసారిగా వ్యాపారస్తుల జీవితాలు అగాధంలోకి తోసినట్లయ్యింది. ఓ వైపు రహదారి విస్తరణకు భూములు కోల్పోయారు. దీనికి తోడు రహదారి విస్తరణ పనులతో స్థానికులు కూడా అటుగా వచ్చిన కొనుగోలు చేయడం తగ్గించారు. ఇక యాత్రీకుల సంగతి సరేసరి. అండర్‌పాస్ పైనుంచే నేరుగా బస్టాండ్ వద్దకు వెళ్తుండటంతో దుకాణాల వైపు వచ్చే వారు లేరు. దీంతో వ్యాపారులు పూర్తిగా మందగించి కుటుంబాలు వీధిన పడ్డాయి.

కొత్త బస్టాండ్లతో వ్యాపారుల ఇబ్బందులు

యాదాద్రి ఆలయ విస్తరణలో భాగంగా గండిచెరువు సమీపంలో ఆర్టీసీ బస్టాండ్, టెంపుల్ బస్‌టెర్మినల్‌ను నిర్మించడంతో ప్రస్తుతం పాత జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బస్టాండ్ సమీపంలోని వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్సులన్నీ ఇక్కడే నిలుస్తుండడంతో బస్టాండ్ సమీపంలోని దుకాణాలు ఎప్పుడూ రద్దీగా ఉంటూ వ్యాపారాలు బాగా జరిగేవి. ఇప్పుడు కొత్త బస్టాండ్ నిర్మించాక నేరుగా భక్తులు అక్కడికి చేరుకుని, కొండపైకి వెళ్తున్నారు. దీంతో ఎన్నాళ్ల నుంచో దుకాణాలు నడుపుతున్న వ్యాపారస్థులు వ్యాపారంజరగక తీసుకున్న రుణాలు,వాటికి మిత్తీలు లోన్‌లు, కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.



గండిచెరువు వద్ద అసంపూర్తిగా మెట్ల నిర్మాణం

సాగుతున్న గిరిప్రదక్షిణ రహదారి పనులు

పంచనారసింహుడు కొలువుదీరిన కొండచుట్టూ సుమారు 2.6కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ రహదారి పనులు సాగుతూనే ఉన్నాయి. రూ.3.2 కోట్లతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. కాగా ఇప్పటివరకు 1.8 కిలోమీటర్ల రహదారి దాదాపు పూర్తి కాగా మిగిలిన 0.8కిలో మీటర్ల మేరకు రహదారి పనులు జరగాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన తర్వాత గిరిప్రదక్షిణ రహదారి చుట్టూ ఫెన్సింగ్, రెయిలింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే గిరిప్రదక్షిణ రహదారి పనులకు నిధుల లేమి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

గండిచెరువు అభివృద్ధి సాగేనా?

యాదగిరికొండ దిగువన మల్లాపూర్ వెళ్లే రహదారిలోని గండిచెరువును రూ.33కోట్ల అంచనా వ్యయంతో మినీ ట్యాంక్‌బండ్ తరహాలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగేనా అన్న ప్రశ్న వినిపిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరంభించిన గండిచెరువు విస్తరణ పనులకు నిధుల గండం నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు రూ.22కోట్లతో పనులు జరగ్గా, మిగిలిన పనులకు రూ.11కోట్ల నిధులు సరిపోవని, ఇక మంజూరైన నిధులతో పనులు చేపడదామన్నా నిధులు మంజూరయ్యేనా అన్న అనుమానాలను వ్యక్తమవుతున్నాయి. గండిచెరువు ముందున్న గుట్టపై లేజర్ షోకు ఏర్పాట్లు, ధ్యాన, ప్రవచన మండపాలతో పాటు పలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

మొదటి ఘాట్‌రోడ్ ఉండగా వంతెన అవసరమా?

యాదగిరిక్షేత్రంలో తులసికాటేజ్ ప్రాంతం నుంచి మొదటి ఘాట్‌రోడ్‌ను అనుసంధానం చేస్తూ వైటీడీఏ సుమారు రూ.33కోట్లతో 480 మీటర్ల పొడవు, 25అడుగుల వెడల్పుతో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తోంది. ఈ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. అయితే దశాబ్దాల కిందట నిజాం రాజుల పాలనలో కొండపైకి రవాణ సౌకర్యాల కోసం మొదటి ఘాట్‌రోడ్ నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే ఆలయ విస్తరణ పనుల వాహనాలు, భక్తుల వాహనాల రద్దీ కారణంగా మొదటి ఘాట్‌రోడ్ దెబ్బతినడంతో ఉద్ఘాటనకు ముందు ఈ ఘాట్‌రోడ్‌ను 36అడుగల వెడల్పుతో పునర్నిర్మించారు. మొదటి ఘాట్‌రోడ్ నిర్మాణం ఉండగా దానిని అనుసంధానం చేస్తూ మరో ఫ్లైఓవర్ నిర్మించడం ఎందుకని, ఈ ఫ్లైఓవర్ ఏమాత్రం అవసరం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఆలయ విస్తరణ కన్నా ముందు రెడ్ల సత్రం సమీపం నుంచి కొండపైకి నిర్మించిన రెండవ ఘాట్‌రోడ్ నేటికి వాహనా రాకపోకలకు అనుతిలేక పోవడంతో వినియోగం లేక వృథాగా ఉంటోంది.

గుట్టలో పడకేసిన పారిశుధ్యం

గుట్ట ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొండపైన బస్‌బే, ప్రధానకార్యాలయం సెల్లార్, కొండకింద నిత్యాన్న వితరణ సత్రం, వ్రత మండపం, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. కొండపై వరకు పందులు, కుక్కలు సంచరిస్తూ వీరవిహారం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.

నిరుపయోగంగా ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లు

యాదగిరిగుట్ట ఆలయ విస్తరణలో భాగంగా కొండకు దక్షిణదిశలో ల్యాండ్ స్కేపింగ్ గార్డెన్‌లను వైటీడీఏ అధికారులు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించారు. అయితే ఈ గార్డెలను భక్తులు చేరుకునే అవకాశం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇదిలాఉంటే గార్డెన్ల నిర్వహణ కోసం సైతం రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుండటం గమనార్హం.




నిరుపయోగంగా రెండో ఘాట్‌రోడ్డు

వార్షిక బ్రహ్మోత్సవాలకు
సిద్ధమవుతున్న పాతగుట్ట

● 15 నుంచి అధ్యయనోత్సవాలు ● 19 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన పూర్వగిరి(పాతగుట్ట) లక్ష్మీనరసింస్వామి సన్నిధి వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు పాంచాహ్నిక దీక్షలో పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు, వీవీఐపీలకు, వివిధ శాఖల అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపిస్తున్నారు. పాతగుట్ట ప్రధానాలయంలో యాగశాల నిర్మాణం, అలంకార సేవల కోసం వాహన సేవలను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నారు. పాతగుట్ట కొండపైన పుష్కరిణి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ఉత్సవాలకు ముస్తాబు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.



పాతగుట్ట ఆలయ ప్రధాన ముఖద్వారం

బ్రహ్మోత్సవ ఘట్టాలు ఇలా..

- ఈ నెల 19వ తేదీ సోమవారం ఉదయం స్వస్తివాచన పూజలతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. సాయంత్రం అంకురారోపణ, మృత్సంగ్రహణం పూజలు.
- 20న ఉదయం ధ్వజారోహణం. సాయంత్రం దేవతాహ్వానం, భేరీపూజ, హవనం.
- 21న ఉదయం సింహవాహన అలంకార సేవ, రాత్రికి ఎదుర్కోలు మహోత్సవం.
- 22న ఉదయం హవనపూజలు, రాత్రి వేళ తిరుకల్యాణోత్సవం.
- 23వ తేదీ ఉదయం నిత్య పూజలు, రాత్రి 8గంటలకు దివ్య విమాన రథోత్సవం.
- 24న ఉదయం యాగశాలలో మహాపూర్ణాహుతి,విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం, సాయంత్రం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం.
- 25న ఉదయం శతఘటాభిషేకం..పండిత సన్మానం..బ్రహ్మోత్సవ పరిసమాప్తి.

పాతగుట్ట ఆలయంలో నిత్యకల్యాణాలు రద్దు

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో నిత్య, శాశ్వత కల్యాణాలను రద్దు చేశారు. ఈ నెల 23వ తేదీన స్వామివారి దివ్యవిమాన రథోత్సవం కారణంగా అర్చనలు, అష్టోత్తరశతనామార్చనలు, భోగాలు, 24వ తేదీన చక్రతీర్థం, 25వ తేదీన స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో అభిషేకాలు అర్చనలు నిలిపివేస్తారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



అద్దాల మండపంలో అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవ పర్వాలు నేత్రపర్వంగా సాగాయి. సుప్రభాతంతో నిత్యపూజలు ఆరంభించిన ఆచార్యులు గర్భాలయంలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. స్వయంభువులను వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలు, కుంకుమలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, ముఖమండపంలోని స్పటిక మూర్తులకు నిత్యార్చనలు, చండీ హవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆస్థాన విద్వాంసులు మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,09,975ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు చినవెంకట్‌రెడ్డి మృతి



కేతేపల్లి, ఫిబ్రవరి 9: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్ర మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు కొత్తపేట గ్రామానికి చెందిన బుర్రి చినవెంకటరెడ్డి(102) గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. చినవెంకట్‌రెడ్డి 1971-83 వరకు ఉమ్మడి కేతేపల్లి గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన స్వగ్రామం కొత్తపేట కాగా పాతికేళ్లుగా హైదరాబాద్‌లో కుమారుల వద్ద ఉంటున్నారు. కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం రాత్రి మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకట్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పీవీ ఆలోచనల ప్రతిరూపం.. సర్వేల్ గురుకులం

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలోని గురుకుల విద్యాలయంతో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు విడదీయరాని అనుబంధం ఉంది. పీవీ నరసింహారావుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆయనతో ఉన్న జ్ఞాకాలను సర్వేల్ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పేదరికంలో మగ్గుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని దారిద్య్రరేఖకు దిగువన ఉన్న పిల్లలకు చక్కటి విద్యాబోధన అందించాలన్నది పీవీ ఆలోచన. ఆయన ఆలోచనలోంచి రూపుదిద్దుకున్నదే సర్వేల్ గ్రామంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి గురుకుల విద్యాలయం. 1970లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన పీవీ నరసింహారావు సర్వేల్ గ్రామంలోని సర్వోదయ ఆశ్రమాన్ని సందర్శించారు. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సర్వేల్ గ్రామంలో ఒక విద్యాసంస్థను ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని కోరారు. ఆయన అడిగిందే తడువుగా గ్రామంలో గురుకుల విద్యాలయం ఏర్పాటుకు అనుమతిఇచ్చారు. తన కలను సాకారం చేయడానికి పీవీ వెంటనే ప్రణాళికలు రూపొందించారు. పూర్వపు గురుకులాలను తలపించే రీతిలో ఆధునిక గురుకుల విద్యాలయాన్ని రూపొందించాలనుకున్నారు. దీని నిర్మాణానికి సర్వేల్ గ్రామానికి చెందిన సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి ముందుకొచ్చారు. నారాయణరెడ్డి తన ఆశ్రమానికి చెందిన 40 ఎకరాల భూమిని దానం చేశారు. అంతరం పీవీ నరసింహారావు సీఎం హోదాలో మళ్లీ సర్వేల్ గ్రామాన్ని సందర్శించారు. సర్వోదయ ఆశ్రమంలో ఏర్పాటుచేసిన దేశంలోనే మొట్టమొదటి గురుకుల విద్యాలయాన్ని 1971 నవంబరు 23 సీఎం హోదాలో పీవీ నరసింహారావు ప్రారంభించారు. ఆనాడు పీవీ సర్వేల్ గ్రామంలో ప్రారంభించిన గురుకుల విద్యాలయం ఎంతో సత్ఫలితాలను ఇచ్చింది. సర్వేల్ గురుకుల విద్యాలయం స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం 1972 మార్చి 1న స్వయం పరిపాలన అధికారం గల ప్రత్యేక గురుకుల విద్యాలయ సంస్థను ఏర్పాటుచేసింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక గురుకుల విద్యాలయాలు ఆవిర్భవించాయి. దీంతో గురుకుల విద్యాలయాలకు రూపకర్తగా పీవీ మారారు. పీవీ ఆలోచనలకు ప్రతిరూపంగా ఆవిర్భవించిన గురుకుల విద్యాలయాలు ఎంతోమంది లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాయి.



మర్రిగూడలో అందుబాటులోకి వైద్యసేవలు

- వైద్యులు లేక మూతబడిన మర్రిగూడ ఆసుపత్రి
- నిలిచిన సేవలపై ఆంధ్రజ్యోతి మినీలో కథనం
- ముగ్గురు వైద్యుల నియమించిన కలెక్టర్
- శుక్రవారం కొనసాగిన వైద్యసేవలు



శుక్రవారం తెరిచిన మర్రిగూడ ఆసుపత్రి

మర్రిగూడ, ఫిబ్రవరి 9 : వైద్యులు లేక మూతబడిన ఆసుపత్రి వైనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. మర్రిగూడ ఆసుపత్రి దుస్థితిపై 'డిప్యుటేషన్ల రద్దుతో మర్రిగూడ ఆస్పత్రి ఖాళీ' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. మర్రిగూడ 30 పడకల ఆసుపత్రిలో డిప్యూటేషన్ మీద వచ్చి 12మంది వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డిప్యూటేషన్లు రద్దు చేస్తూ వైద్యులు ఎక్కడి నుంచి వచ్చారో ఆ స్థలాలకు వెళ్లి వెద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మర్రిగూడ ఆసుపత్రిలోని 12 మంది వైద్యులు ఒకేసారి తన స్థానాలకు వెళ్లిపోయారు. దీంతో గురువారం వైద్యసేవలు నిలిచిపోయాయి. ఆసుపత్రిలో నిలిచిన సేవలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ హరిచందన స్పందించారు. ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు నిలిచిపోకుండా కొనసాగించాలని ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం ముగ్గురు వైద్యులను నియమించి తిరిగి వైద్యసేవలు అందేలా ఏర్పాటుచేశారు. వైద్యులు లేక మూతపడిన ఆసుపత్రి తలుపులు శుక్రవారం తెరుచుకోవడంతో రోగులు హర్షం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో కే నారాయణరెడ్డి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో
సీనియర్స్ పోటీలు ప్రారంభం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ 56వ ఖోఖో సీనియర్ ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో డాక్టర్ కే నారాయణరెడ్డి, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జంగ రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ సంప్రదాయ క్రీడ అయిన ఖోఖోకు పూర్వ వైభవం వస్తుందన్నారు. క్రమేపీ ఆదరణ పెరుగుతున్నదన్నారు. అంతకుముందు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌తో అతిథులకు గౌరవవందనం చేశారు. పోటీల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీపీ నరాల నిర్మల, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ స్టాలిన్ పాల్గొన్నారు. తొలి రోజు మ్యాచ్‌లను క్రీడాభిమానులు ఉత్సాహంగా తిలకించారు.

20 జట్లు, 48 మ్యాచ్‌లు

భువనగిరిలో మూడు రోజుల పాటు జరుగనున్న తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలకు 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 20 మహిళ, పురుషుల జట్లు, 300 మంది క్రీడాకారులు, 300 కోచ్‌లు, మేనేజర్లు అధికారులు హాజరవుతున్నారు. పగలు, రాత్రి రెండు కోర్టుల్లో 48 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందుకోసం ఫ్లడ్‌లైట్లతో పాటు పూర్తిస్థాయి ఏర్పాట్లుచేశారు. దీంతో భువనగిరిలో క్రీడా సంబురం నెలకొంది. పోటీల్లో ప్రతిభ చూపే 20 మంది మహిళలు, 20 మంది పరుషులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తారు. ఎంపికైన క్రీడాకారులు జూన్‌లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో నిర్వహించే జాతీయ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు.

తొలి రోజు 14 మ్యాచ్‌లు



అవుట్ చేసేందుకు యత్నిస్తున్న క్రీడాకారుడు

ఛాంపియన్‌షిప్ పోటీల్లో తొలి రోజు 14 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో 8 పురుషుల, 6 మహిళల మ్యాచ్‌లు జరిగాయి. తొలి రోజున అతిథ్య నల్లగొండ జట్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల జట్టు విజయం సాధించగా పురుషుల జట్లు తొలి మ్యాచ్‌లో ఓడిపోవడం స్థానిక క్రీడాకారులను నిరాశపర్చింది. అయితే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అభిమానులు క్రీడాస్ఫూర్తిని చాటారు. ఇదిలా ఉండగా ఛాంపియన్ షిప్ పోటీల్లో తొలి రోజు మహిళల విభాగంలో నల్లగొండ జట్టు ఖమ్మంపై 17-5 పాయింట్లతో, హైదరాబాద్ జట్టు ఆదిలాబాద్‌పై 10-5, మహబూబ్‌నగర్ జట్లు నిజామాబాద్‌పై 10-5, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 15-3, ఆదిలాబాద్ జట్టు కరీంనగర్‌పై 11-4 పాయింట్లతో విజయం సాధించాయి. పురుషుల విభాగంలో ఆదిలాబాద్ జట్టు నల్లగొండపై 13-12, ఖమ్మం జట్టు మెదక్‌పై 13-12, కరీంనగర్ జట్టు మహబూబ్‌నగర్‌పై 13-10, వరంగల్ జట్టు నిజామాబాద్‌పై 15-10, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 12-10, హైదరాబాద్ జట్టు నల్లగొండపై 13-11, కరీంనగర్ జట్టు ఖమ్మంపై 10-8, ఆదిలాబాద్ జట్టు వరంగల్‌పై 15-4 పాయింట్లతో గెలుపొందాయి.

హమ్మ బాబోయ్ దొంగలు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 9 : తీగ లాగితే డొంక కదిలింది. ట్యాబ్ తస్కరిస్తున్న మహిళను పోలీసులు పట్టుకుని విచారించగా 10 మంది సభ్యులున్న దొంగల ముఠా గుట్టు రట్టయ్యింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంద్యాల జిల్లా డోన్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరంతా హైదరాబాద్ సమీపంలోని బొంగులూరు వద్ద ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటూ వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు, రద్దీ ప్రదేశాల్లో దొంగతనాలకు చేస్తుంటారు. ఈ క్రమంలోనే కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ మహిళ వద్ద నుంచి ట్యాబ్‌ను చోరీ చేస్తున్న మహిళను స్థానికులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ మహిళను తమదైన శైలిలో విచారించగా 10 మందితో కూడిన దొంగల ముఠా పట్టుబడింది. వీరితో పాటు నలుగురు నేరస్తులు పట్టుబడ్డారు. వీరి నుంచి కారు, 10 సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ వీరబాబు, సిబ్బంది హేమనాయక్, వెంకటేశ్, భాస్కర్, గురువారెడ్డి, లక్ష్మణ్‌లను ఆయన అభినందించారు.

కొట్టేసిన బైక్‌జీపీఎస్ లొకేషన్‌తో పట్టివేత

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 9 : జల్సాల కోసం చోరీలు చేస్తున్న ఇద్దరు యువకులను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ నర్సింహారావు కేసు వివరాలను వెల్లడించారు. గతంలో కారుడ్రైవర్‌గా పనిచేసిన కనగల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షి శ్రీను అలియాస్ నల్లగొండ శ్రీను తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు చేయడం ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఇతడిపై హైదరాబాద్, నల్లగొండ జిల్లాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో 40 చోరీ కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. ఓ చోరీ కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి ఈ నెల 1వ తేదీన బయటకువచ్చాడు. చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా పొద్దుటూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన అలమూరి సంజీవరెడ్డితో పరిచయం ఏర్పడింది. ఇతను కొంతకాలం ఓ కంపెనీలో టెలీకాలర్‌గా పనిచేస్తూ ఓ కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చాక చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో చోరీలు చేసేందుకు సిద్ధపడ్డారు. అందులో భాగంగా ఈ నెల 6న రాత్రి మిర్యాలగూడ వచ్చిన నిందితులిద్దరూ స్థానిక అశోక్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలతో పాటు నగదును చోరీ చేశారని సీఐ తెలిపారు. అదేవిధంగా ఇదే కాలనీలోని ఓ ఇంటిముందు పార్క్‌చేసిన టీఎస్05ఎఫ్‌కే 5597 నెంబర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. బైక్‌కు జీపీఎస్ లొకేషన్ ఉండడంతో దాని ఆధారంగా హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ఏరియాలో సంచరిస్తున్నట్లుగా గుర్తించిన పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించగా తాము చేసిన నేరాలను అంగీకరించడంతో ఇరువురిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. కాజేసిన సొత్తును విక్రయించి మద్యం, సిగరేట్ ఇతర వ్యసనాలు తీర్చుకునేందుకు వచ్చే డబ్బును నిందితులు ఖర్చుచేసేవారని సీఐ తెలిపారు. కాగా దొంగలను చాకచక్యంగా పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్ఐలు కృష్ణయ్య, రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పీసీలు రవి, అనిల్,నరేష్, రామకృష్ణలను సీఐ అభినందించారు.

యువకుల ఛేజింగ్.. దొంగల పరార్



దొంగలు పరారైందీ ఈ కారులోనే

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారంలో అనుమానాస్పదంగా కారులో తిరుగుతున్న వ్యక్తులను ప్రశ్నించిన గ్రామ యువకులపై దాడి చేసి సినీ ఫక్కీలో పరారయ్యారు గుర్తు తెలియని వ్యక్తులు. వీరిని దొంగలుగా అనుమానిస్తున్నారు. కారులో పరారవుతుండగా వెనక యువకులు వెంబడించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. జైకేసారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వారం రోజుల క్రితం కారులో వచ్చిన దొంగలు 10 మేకలను అపహరించారు. ఈ క్రమంలో శుక్రవారం ఓ కారులో ఇద్దరు యువకులు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని యువకులు అడ్డుకుని ప్రశ్నించబోయారు. దీంతో వారు యువకులపై దాడి చేసి కారులో చౌటుప్పల్ వైపు పరారయ్యారు. కానీ యువకులు ధైర్యంతో కారును ఛేజింగ్ చేస్తూ వీడియో తీశారు. దొంగలు కారును చౌటుప్పల్ వద్ద వలిగొండ రోడ్డులోని బాలాజీ వెంచర్‌లోకి అతివేగంతో తీసుకెళ్లారు. ఆ ప్రాంత యువకులు అడ్డుకోవడానికి యత్నించినా ఆపకుండా సినీఫక్కీలో గల్లి గల్లి తిప్పుతూ అతివేగంతో హైవే మీదుకు దూసుకెళ్లారు. ఈ సంఘటనపై మాజీ సర్పంచ్ సైదులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు వనస్థలిపురం ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గీత కార్మికుడు మృతి



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 9 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గీత కార్మికుడు మృతి చెందాడు. ఏఎస్ఐ జానీ తెలిపిన వివరాలప్రకారం వెల్లటూరు గ్రామానికి చెందిన సీసం వెంకటేశ్వర్లు(36) కల్లు గీత వృత్తిని నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో మండల కేంద్రంలో వృత్తి పని ముగించుకుని స్వగ్రామం వెల్లటూరు వెళ్తుండగా రాఘవపురం క్రాస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో హుజూర్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని జానీ తెలిపారు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు పిల్లలు కాగా భార్య వెంకటరావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సంతుసేవాలాల్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 9: గిరిజన ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి పోస్టర్‌ను హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గిరిజన ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సేవాలాల్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరిస్తామని, జయంతి వేడుకలకు నిధులు కేటాయించినట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు బాలునాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్, రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకులు, డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన


డ్రైనేజీలను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

దేవరకొండ, ఫిబ్రవరి 9: దేవరకొండ మండలంలో పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ నల్లగొండ ఎస్ఈ ప్రకాష్ ఆధ్వర్యంలో ఇంజనీర్ల బృందం పనులను పరిశీలించారు. దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్ల డ్రైనేజీ నిర్మాణ పనులు, నీటి ట్యాంకుల నిర్మాణ నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఆయన వెంట దేవరకొండ పీఆర్ డీఈ లింగారెడ్డి, అధికారులు భాస్కర్‌రెడ్డి, శంకర్ ఉన్నారు.

నల్లగొండలో వైభవంగా చండీహోమం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో గల అభయాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శుక్రవారం అర్చకస్వాములు మంత్రోచ్చారణల మధ్య చండీహోమం, మూలమంత్ర హోమాలు, జలాధివాసం, క్షీరాధివాసం, మూలమంత్ర అనుష్టానం, అఖండ దీపారాధన, దేవతా హోమాలు వంటి పూజలను నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి దంపతులు ప్రత్యేకంగా హాజరై పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు వేదపారాయణం, సూర్య నమస్కారాలు వంటి వాటిని చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ శాశ్వత అధ్యక్షుడు వేనేపల్లి లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు బైరగోని రాజయ్య, ప్రధాన కార్యదర్శి బండారు ప్రసాద్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఇటికాల కృష్ణయ్య, సూర్యనారాయణ, నన్నూరి రాంరెడ్డి, హరిప్రసాద్, ఏచూరి భాస్కర్, గుండెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, సతీష్, అభిమన్యుశ్రీనివాస్, ఎండ్ల శ్రీనివాస్ హాజరయ్యారు.

బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించాలి

దేవరకొండ, ఫిబ్రవరి 9: దేవరకొండ పట్టణంలో అసంపూర్తిగా నిర్మించిన బ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేయాలని నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు భాస్కరశర్మ, వైద్యుల కృష్ణమూర్తిశర్మ కోరారు. దేవరకొండ పాత రామాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బ్రాహ్మణసంఘం నియోజకవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. నూతన సంవత్సరం ఉగాదికి నూతన పంచాంగ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సురభి కృష్ణమూర్తిశర్మ, ఉప్పల శ్రీకాంత్‌శర్మ, ఉప్పల శ్రీనివాస్‌శర్మ, గంప శశిశర్మ, గంటసాల శివప్రసాద్, గొట్టిముక్కల గణేష్ శర్మ, శ్రీనివాస్‌శర్మ, సురభి ప్రభాకర్‌శర్మ, నరహరిరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి టీపీఆర్టీయూ కృషి


పీఆర్‌టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 9: ఉపాధ్యాయుల సంక్షేమానికి, అనేక జీవోలను సాధించిన ఏకైక సంఘం టీపీఆర్టీయూ అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, కాళం నారాయణరెడ్డి అన్నారు. పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ భవనంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం 1971లో సంఘం ఏర్పడిందని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులు సంక్షేమమే ధ్యేయంగా టీపీఆర్టీయూ పనిచేస్తుందని, అనేకమైన జీవోలను ప్రభుత్వం నుంచి వెలువడడానికి సంఘం విశేషంగా కృషి చేసిందన్నారు. బదిలీలు, ప్రమోషన్ల కమీషన్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. సంఘం కోసం విశేషంగా కృషి చేసి అమరులైనటు వంటి నాయకులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, పత్రిక రాష్ట్ర సంపాదక వర్గ సభ్యుడు దీరావత్ నర్సింహ్మానాయక్, తరాల జగదీష్, మేకల జానిరెడ్డి, తరాల పరమేష్, చామల చంద్రశేఖర్, రమేష్ రెడ్డి, అంబటి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రఘు, గాదె వెంకట్‌రెడ్డి, మండల బాధ్యులు, జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 9: అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఈ నెల 13వ తేదీన జరిగే కృష్ణా జలాల పరిరక్షణ సభకు సంబంధించిన చలో నల్లగొండ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు గాలిలోనే తిరుగుతున్నారని, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక కష్టాలకు ఓర్చి తెలంగాణను సాధించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా బోర్డు బాధ్యతలను కేంద్రప్రభుత్వానికి అప్పగించడంతో తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాల వాటాలో నష్టం జరగనుందన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు నియోజకవర్గ నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ అనేక అవమానాలు తట్టుకుని ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిందని అన్నారు. కార్యక్రమంలో సభ సమన్వయకర్త రవీందర్‌సింగ్, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు దేవేందర్, శరణ్యారెడ్డి, సత్తయ్యగౌడ్, పిచ్చయ్య, జమాల్‌ఖాద్రీ, సుధాకర్, దయాకర్, రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం చర్లపల్లి బైపాస్ రోడ్డులో నిర్వహించే సభాస్థలిలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

చలో నల్లగొండ సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ: హక్కుల సాధన కోసం నల్లగొండలో జరిగే సభ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, బీఆర్ఎస్ సమన్వయకర్త, పటాన్ చెరువు బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి కోరారు. పట్టణంలో శుక్రవారం వేములపల్లి, మాడ్గులపల్లి, అడవిదేవులపల్లి మండలాల, పట్టణ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణాజలాల్లో రాష్ట్ర వాటా హక్కుల సాధనే ధ్యేయంగా జిల్లా కేంద్రంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, జడ్పీటీసీ సేవ్యానాయక్, మోసిన్‌అలీ, పాలుట్ల బాబయ్య, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కురుణాకర్‌రెడ్డి, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, నవీన్‌రెడ్డి, మల్లేష్, మల్లయ్యయాదవ్, పార్టీ ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా ప్రసాద్ నియామకం


పీఎస్‌డీ ప్రసాద్

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 9: సెకండ్ మల్టీజోన్ పరిధిలో వెయిటింగ్‌లో ఉన్న పీఎస్‌డీ ప్రసాద్‌ను మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన రాఘవేందర్ సైఫాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

ఎస్ఐగా నారాయణరెడ్డి

తిరుమలగిరి(సాగర్): మండల నూతన ఎస్ఐగా వి.నారాయణరెడ్డిని నియమిస్తూ శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని సీసీఎస్‌లో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వి.సురేష్ బదిలీపై నల్లగొండ జిల్లా కేంద్రంలోని టూటౌన్ ఎస్ఐ-2గా నియమితులయ్యారు. నారాయణరెడ్డి శనివారం విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

కనగల్ ఎస్ఐగా రవి

కనగల్: కనగల్ ఎస్ఐ ఇ.రవిని నియమితులయ్యారు. అంతకుముందు ఆయన వీఆర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణగౌడ్‌కు స్థానచలనం కల్పించింది.

'ప్రజాపాలన' డేటా ఎంట్రీని పూర్తిచేయాలి


త్రిపురారం : సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో చెన్నయ్య, పీడీ రాజ్‌కుమార్

మాడ్గులపల్లి, త్రిపురారం, ఫిబ్రవరి 9: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డేటా ఎంట్రీని పూర్తి చేయాలని, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో చెన్నయ్య అన్నారు. మాడ్గులపల్లి, త్రిపురారం మండలంలోని ఇందుగుల గ్రామంలో శుక్రవారం డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది పనితీరును వారు పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాల్లో తప్పులు ఉన్న లిస్టును గ్రామాల వారీగా పంపించామని, లబ్ధిదారుల నుంచి పూర్తి వివరాలను సేకరించి నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రక్రియను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డేటా ఎంట్రీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో అలివేలు మంగమ్మ, తహసీల్దార్లు ప్రమీల, జమీరుద్దీన్, డీటీ సైదులు, ఆర్ఐ అక్తర్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలాంటి పొరపాట్లు ఉండవద్దు

మునుగోడు: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్ చేయాలని మునుగోడు ఎంపీడీవో, ప్రత్యేకాధికారి రాపర్తి భాస్కర్‌గౌడ్ అన్నారు. మునుగోడులోని గ్రామపంచాయతీ కార్యాలయంలో చేపడుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుల్లో అక్షరదోషాలు ఉంటే ఆయా పథకాలకు అనర్హులుగా మారుతారని, అలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రతీ దరఖాస్తును ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్జీదారులు సరైన వివరాలు నమోదు చేయకుంటే సమాచారం తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులు పూర్తిస్థాయిలో రాణించాలి: డీఈవో


కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 9: విద్యాభ్యాసంలో ప్రతీ విద్యార్థి పూర్తి సామర్థ్యాలను సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి అన్నారు. నార్కట్‌పల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. భోజన నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాకులకు డీఈవో సూచించారు. సమావేశంలో ఎంఈవో కూకుట్ల నర్సింహ, హెచ్ఎం రాములు, వెంకటేశం, హిమజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


సునీల్

హాలియా, ఫిబ్రవరి 9: సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 30వ తేదీన జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో హాలియా మునిసిపాలిటీలోని ఆకాంక్ష పాఠశాలకు చెందిన ఆర్.సునీల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో వరంగల్ జిల్లా హన్మకొండలో జరిగే పోటీల్లో వారు పాల్గొననున్నట్లు పాఠశాల యజమాన్యం తెలిపింది. రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపిక కావడం సంతోషకరమని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్, కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్‌యాదవ్, అధ్యాపక బృందం అభినందించారు.

పీవీకి భారతరత్న ప్రకటించడం అభినందనీయం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నూకల నర్సింహారెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధాని తెలంగాణ గడ్డపై పుట్టిన తెలుగు వ్యక్తి పీవీ నర్సింహారావు కేంద్రప్రభుత్వం అత్యున్నత పురస్కారం భారతరత్న ఇచ్చి గౌరవించడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నర్సింహారెడ్డి అన్నారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 భాషలు అనర్గళంగా మాట్లాడి, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన పీవీతో పాటు మాజీ ఉపప్రధాని, రామజన్మభూమి రథసారథి ఎల్‌కే అద్వానీ, మాజీ ప్రధాని, రైతు నాయకుడు చౌదరి చరణ్ సింగ్, హరిత విప్లవానికి నాంది పలికిన ఎంఎస్. స్వామినాథన్, బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించిన తొలి వ్యక్తి కర్పూరీ ఠాకూర్‌లకు భారతరత్న ఇవ్వడం హర్షనీయమని అన్నారు. భారతదేశ చరిత్రలో ఈ సారి ఐదుగురు మహోన్నత వ్యక్తులకు భారతరత్న పురస్కారం దక్కడం ఎంతో సంతోషమని తెలిపారు. ప్రధానమంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సంస్కరణలను కొనియాడారు. అనంతరం పార్టీ నాయకులు స్వీట్లు తినిపించుకున్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతేపాక సాంబయ్య, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పెరిక మునికుమార్, మేకల అనిల్, శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హర్షం

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హర్షం ప్రకటించారు. భారతరత్న రావడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. పీవీ నర్సింహారావు ప్రధానిగా చేసిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2020లో అసెంబ్లీ సాక్షిగా పీవీకి భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

● భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రదానం చేయడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు అన్నారు. పీవీ నర్సింహారావు ప్రధానిగా చేసిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఎన్ని అవాంతరాలు వచ్చినా మన ఆర్థిక వ్యవస్థ బలోపేతంగానే ఉందన్నారు. ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

ప్రపంచ గిరిజనులను ఐక్యం చేసిన పండుగ

● సమ్మక్క సారలమ్మ జాతరపై స్కాలర్ ప్రవీణ్‌రెడ్డి


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రవీణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 9: మేడారం సమ్మక్క, సారలమ్మల జాతర ప్రపంచ గిరిజనులను ఐక్యం చేసిన ఘనత దక్కించుకుందని యువ కవి ఉస్మానియా యూనివర్సిటీ స్కాలర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన రెండు రోజుల సదస్సులో నార్కట్‌పల్లికి చెందిన స్కాలర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి కోయ గిరిజనుల పండుగలపై ఆయన పత్ర సమర్పణ చేశారు. తెలుగు జానపద సాహిత్య పరిషత్, దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థలు సంయుక్తంగా 'జానపద విజ్ఞానం- పరిరక్షణ' అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికలో కోయ గిరిజన పండుగలు- సాంస్కృతిక విశేషాలపై నర్రా ప్రవీణ్ రెడ్డి పత్ర సమర్పణ చేసి ప్రసంగించారు. అనంతరం ఆచార్య పులికొండ సుబ్బాచారి, భక్తవత్సలరెడ్డి, సీహెచ్ వసుంధర, పగడాల చంద్రశేఖర్, ఆచార్య సూర్య ధనుంజయలతో జరిగిన చర్చాగోష్టిలో పాల్గొన్నాడు. ఈ సదస్సులో యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, బిట్టు వెంకటేశ్వర్లు, చిగిచర్ల కృష్ణారెడ్డి, కే.శ్యామల, జ్యోతి పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ, ఫిబ్రవరి 9: దేవరకొండ మండలం మైనంపల్లి, తాటికోలు వాగుల నుంచి అక్రమంగా రవాణా అవుతున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తాటికోలు, మైనంపల్లి వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇసుకను వాగుల నుంచి అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'భూ నిర్వాసితులందరికీ పరిహారం అందించాలి'

దామరచర్ల, ఫిబ్రవరి 9: మండలంలో నిర్మిస్తున్న యాదాద్రి విద్యుత్ పరిశ్రమలో భూములు కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గతంలో పార్ట్-బీలో మూడుసార్లు సర్వే చేశారని, కాని ఇప్పటివరకు కబ్జాలో ఉన్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించలేదన్నారు. వెంటనే అర్హులైన వారందరికీ ప్రభుత్వం పాస్ పుస్తకాలు అందించి ఆదుకోవాలన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ, ఫిబ్రవరి 9: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి కోరారు. దేవరకొండలో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నూనె వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు, మైనుద్దీన్, బుచ్చయ్య, గెల్వయ్య పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య కోరారు. గ్రామపంచాయతీ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీవో మోహన్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కనీసం రూ.26 వేలు ఇవ్వాలని, పింఛన్ రూ.10 వేలకు పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. ఈ నెల 16న జరిగే సమ్మెను గ్రామ పంచాయతీ సిబ్బంది విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మద్దిమడుగు ఏశోబు, ధర్మాపురం దానయ్య, శివశంకరాచారి, సంజీవ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడటౌన్: వాసవీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఆర్యవైశ్య మహిళా విభాగ రాష్ట్ర నాయకురాలు రాయపుడి భవాని అన్నారు. వాసవీ, వనిత, కుసుమాంబ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో పలు సేవా కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు.

మిర్యాలగూడ టౌన్: బీసీల కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. దేశం, రాష్ట్రంలో పశువుల గణన చేపట్టిన ప్రభుత్వాలు జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

నల్లగొండ కల్చరల్: మధుర గాయకులు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో ఘంటసాల గానామృత సభను నిర్వహిస్తున్నట్లు సాహితీ వేత్తలు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, దాసోజు జ్ఞానేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు.

● జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఈ నెల 12వ తేదీన జిల్లా రచయితల మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరి తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి: సబ్ జూనియర్ బాల, బాలికలు కబడ్డీ జట్ల ఎంపికను ఈ నెల 10వ తేదీన పీఏపల్లి మండలంలోని మేడారం గ్రామంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య తెలిపారు.

శాలిగౌరారం: ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన జోగు మల్లయ్య కుటుంబానికి శాలిగౌరారం హమాలీల సంఘం ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయం అందించారు.

గుర్రంపోడు: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు గజ్జెల చెన్నారెడ్డి తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి సమయం కేటాయించలేకపోతున్నానని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రుమలగిరి(సాగర్): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఎం సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ చాంద్‌పాషా డిమాండ్ చేశారు. మండలంలోని రాజవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఐదు నెలలుగా బిల్లులు, వేతనాలు అందక మధ్యాహ్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రామగిరి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ దళిత విభాగ చైర్మన్ నాగారి ప్రీతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కట్టంగూరు: కట్టంగూరులోని జడ్పీ హైస్కూల్‌లో కామినేని దంత వైద్య కళాశాల వైద్యులు శుక్రవారం విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 380 మంది బాల, బాలికలకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 140 మంది విద్యార్థులకు దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.

హాలియా: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ధనావత్ భాస్కర్‌నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు సపావట్ పాండునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మిర్యాలగూడ: విద్యుత్ సమస్యలపై వినియోగదారులు సంప్రదించేందుకు వీలుగా అధికారుల పేర్లను వార్డుల్లో బోర్డులపై ఏర్పాటు చేయాలని తెలంగాణ యువజన సేవా సంఘం అధ్యక్షుడు సుంకు శ్రీనివాస్ కోరారు. యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ డివిజనల్ అధికారి నికితకు వినతిపత్రం అందజేశారు.

పోలీసులు అదుపులో జీవాల దొంగల ముఠా

● దొంగలను పట్టించిన సీసీ కెమెరా

మర్రిగూడ, ఫిబ్రవరి 9: గొర్రెలు, మేకల దొంగతనమే వృత్తిగా ఎంచుకున్న ముఠాను మర్రిగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 7వ తేదీ బుధవారం రాత్రి మండలంలోని పల్లె అంజయ్య, ఇరిగదిండ్ల సత్తయ్య ఇళ్ల ముందు ఉన్న నాలుగు మేకలు, గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంగారెడ్డి విచారణలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. కారులో జీవాలను తరలిస్తున్నట్లు గుర్తించి, కారు నెంబరు ఆధారంగా హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉంటున్న కారు యజమాని లింగాల నరేష్‌ను సంప్రదించారు. కార్లను అద్దెకు ఇస్తూ నరేష్ జీవనం సాగిస్తున్నాడు. అయితే అతడి వద్ద జీవాలను దొంగిలించిన వ్యక్తులు నెల రోజుల కిందట ఆధార్ జీరాక్స్ కాపీలను పెట్టి కారును అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. ఆధార్‌లోని చిరునామా ఆధారంగా దొంగలు నల్లగొండ జిల్లాలోని త్రిపురారం, హాలియా మండలానికి చెందిన వారని తెలుసుకుని వారి గ్రామాలకు గురువారం రాత్రి వెళ్లి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. విచారణలో ఈ ఇద్దరితో పాటు మరో ఇద్దరు కూడా ఉన్నట్లు తెలిసింది. నలుగురు కలిసి ముఠాగా ఏర్పడి మేకలు, గొర్రెలను దొంగతనం చేయడం వృత్తిగా ఎంచుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ముఠాను పోలీసులు విచారిస్తున్నారు. ఎక్కడెక్కడ దొంగతనాలకు పాల్పడిందో విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఉపాధిహామీ కూలీకి గాయాలు

మునుగోడురూరల్, ఫిబ్రవరి 9: ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీ తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదం మండలంలోని పలివెల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం పలివెల గ్రామానికి చెందిన గుత్తి జయమ్మ ఉపాధి హామీ పనులకు వెళ్లింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలోని చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. పూడిక తీసిన మట్టిని కూలీలు ట్రాక్టర్‌కు ఎత్తారు. ఆ సమయంలో చెరువులో ట్రాక్టర్ దిగబడింది. ట్రాక్టర్‌ను బయటకు వెళ్లదీసేందుకు కూలీలు ట్రాక్టర్‌ను ముందుకు నెడుతున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ వెనక్కు రావడంతో గుత్తి జయమ్మ కాలు ట్రాక్టర్ టైర్ కింద పడింది. దీంతో ఆమె కాలు విరిగింది. గమనించిన గ్రామస్థులు, కూలీలు బాధితురాలు జయమ్మను చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించారు.